క్లుప్తంగా

మున్సిపాలిటీ కమిషనర్‌గా వాసుబాబు



మాట్లాడుతున్న కమిషనర్ వాసుబాబు

రాయచోటి అర్బన్: రాయచోటి మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా ఎస్.వాసుబాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ నెల 1న కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస రావు అనారోగ్యం కారణంగా సెలవుపై వెళ్లారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ సెక్రటరీగా పనిచేస్తున్న వాసుబాబును ప్రభుత్వం రాయచోటి మున్సిపాలిటీ కమిషనర్‌గా నియమించింది.

భరత్ కుమార్‌రెడ్డికి నివాళి



సమాధి వద్ద నివాళులర్పిస్తున్న సునీల్‌రెడ్డి

గాలివీడు: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కో కన్వీనర్ భరత్‌కుమార్‌రెడ్డి కుటుంబాన్ని రాష్ట్ర యూత్ వింగ్ అధ్యక్షుడు సునీల్ రెడ్డి శనివారం పరామర్శించారు. భరత్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భరత్ కుటుంబ సభ్యులకు వైఎస్సార్‌సీపీ ఎప్పటికీ అండగా ఉంటుందని తెలిపారు. ఆయనతో పాటు మండల కన్వీనర్ మిట్టపల్లె యదుభూషన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ యూత్ వింగ్ సభ్యులు బ్రహ్మానందరెడ్డి, సుబ్బారెడ్డి, సోషియల్ మీడియా సభ్యులు పాల్గొన్నారు.

ఆలయ ప్రతిష్టకు ఏర్పాట్లు



ఆలయ కమిటీ సభ్యులతో ఏర్పాట్లపై చర్చిస్తున్న ఈఓ కొండారెడ్డి

గాలివీడు: స్థానిక పెద్దూరు బ్రాహ్మణవీధిలోని పురాతన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలకు ఏర్పాట్లుచేస్తున్నట్లు దేవాదాయశాఖ ఈఓ కొండారెడ్డి తెలిపారు. కమిటీ సభ్యులతో కలిసి శనివారం ఆలయంలో ఏర్పాట్లను ఈవో పరిశీలించారు. ఈవో మాట్లాడుతూ మార్చి 18, 19, 20వ తేదీలలో ఉత్సవాలకు వచ్చే భక్తులకు వసతి, పార్కింగ్, అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలపై సిబ్బందితో సమీక్షించామని తెలిపారు. 20న బుధవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి గ్రామోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు హరికృష్ణ, వీరారెడ్డి, మణికుమార్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సేవలకు గుర్తింపు

రాజంపేట: ఆర్టీసీలో ఆదర్శ ఉద్యోగుల సేవలకు తగిన గుర్తింపు ఉంటుందని రాజంపేట డిపో మేనేజర్ రమణయ్య అన్నారు. డిపో గ్యారేజీ క్యాంపస్‌లో కండక్టర్లు మల్లయ్య, భాస్కర్‌లను శనివారం ప్రశంసాపత్రంతో ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి -24 మాసంలో ఆదాయం తీసుకొచ్చిన వారిని తోటి ఉద్యోగులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్లు ఏపీరాజు, ఫిరోజిలను నగదు పురస్కారంతో సత్కరించారు.

పాడి రైతులకు గడ్డి విత్తనాలు



రైతులకు గడ్డి విత్తనాలు అందజేస్తున్న దృశ్యం

పుల్లంపేట: రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతులకు 50 శాతం రాయితీతో గడ్డి విత్తనాలు అందించి ఆసరాగా నిలిచిందని అనంతంపల్లి గ్రామానికి చెందిన రైతులు వెంకట సుబ్బయ్య, మణి, శివారెడ్డి, శంకర్ రెడ్డి అన్నారు. రైతు భరోసా కేంద్రం ద్వారా ఇంటివద్దే గడ్డి విత్తనాలు అందించడంపై వారు సంతోషం వ్యక్తం చేశారు.

సమస్యలపై దృష్టి సారించండి

గాలివీడు: మండల అధికారులు ప్రజల సమస్యలపై దృష్టి సారించాలని ఎంపీపీ పద్మావతమ్మ, వైస్ ఎంపీపీ మిట్టపల్లె యదుభూషన్ రెడ్డి సూచించారు. మండల ఎంపీడీఓ కార్యాలయంలోని సభా భవనంలో శనివారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి కాలం సమీపిస్తుండడంతో తాగునీటికి మొదటి ప్రాధాన్యం ఇస్తూ ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. వేసవి తాపం ఎక్కువవుతుండడంతో వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి తగు చర్యలు తీసుకోవాన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

చేయూతతో పేదల జీవితాల్లో వెలుగు

జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి



లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

సిద్దవటం: పేద ప్రజల పక్షాన నిలబడే పార్టీ వైఎస్సార్‌సీపీనే అని రాజంపేట వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మాధవరం వద్దగల కనకదుర్గ కళ్యాణ మండపంలో సిద్దవటం, ఒంటిమిట్ట మండలాల మహిళలకు వైఎస్‌ఆర్ చేయూత కింద శనివారం ఉదయం జరిగిన మెగా చెక్కు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దారి పొడవునా పూలు చల్లుతూ జడ్పీ చైర్మన్‌కు మహిళలు స్వాగతం పలికారు. మెగా చెక్కును రెండు మండలాల లబ్దిదారులకు అందజేసిన అనంతరం అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ సిద్దవటం మండలంలో 1808 మంది లబ్దిదారుల ఖాతాలకు 4వ విడతగా చేయూత పథకం కింద రూ.339 లక్షలు, ఒంటిమిట్ట మండలంలో 1537 మంది ఖాతాలకు రూ. 288.19 లక్షలు నేరుగా జమచేయడం జరిగిందన్నారు. నవరత్నాల ద్వారా ప్రతి కుటుంబానికి న్యాయం జరిగిందని, ప్రతి మహిళను లక్ష్మాధికారిని చేయడమే వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. ప్రతి పక్షాల మాయ మాటలను నమ్మి ఎవరూ మోస పోవద్దన్నారు. రాబోయే ఎన్నికల్లో రాజంపేట వైఎస్‌ఆర్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి పి.వి.మిథున్‌రెడ్డి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, ఏకుల రాజేశ్వరిరెడ్డి, వల్లిచాన్, శ్రీకాంత్‌రెడ్డి, నారపురెడ్డి శ్రీనివాసులరెడ్డి, నీలకంఠారెడ్డి, వావిళ్ల శ్రీనివాసుల రెడ్డి, గోపాలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజమార్గం



లోక అదాలత్ నిర్వహిస్తున్న న్యాయమూర్తులు



లోక్ అదాలత్ లో పాల్గొన్న జడ్జి ఫైజున్నీసా

లక్కిరెడ్డిపల్లి: కక్షదారులు క్షణికావేశంలో కేసులు పెట్టుకొని జైలుకు వెళ్లకుండారాజీపడడమే రాజమార్గమని లక్కిరెడ్డిపల్లె కోర్టు సివిల్ జడ్జి షేక్ ఫైజున్నీషా అన్నారు. లక్కిరెడ్డిపల్లె సివిల్ కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్కిరెడ్డిపల్లె, గాలివీడు, రామాపురం మండలాలకు సంబంధించిన పలు కేసులను పరిష్కరించినట్లు కోర్టు వర్గాలు తెలిపారు. 27 కేసులకు గానూ రూ.32,97,023 వసూలైనట్లు వారు తెలిపారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ కక్షదారు క్షణికావేశానికి గురికాకుండా శాంత స్వభావంతో నడుచుకోవాలన్నారు. చిన్న చిన్న గొడవలు, భూ సమస్యలు, భార్య భర్తల గొడవలను గ్రామస్థాయిలోనే పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఎంఎల్.రామచంద్రారెడ్డి, బాలాజీ రెడ్డి, చెన్నకృష్ణయ్య, రెడ్డయ్య, సిద్ధయ్య, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్

రాయచోటి టౌన్: జాతీయ లోక్ అదాలత్ ద్వారా 124 కేసులు పరిష్కరించి బాధితులకు రూ. 1,36,07,751 మొత్తాన్ని శనివిారం అందజేశారు. రాయచోటి కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మొదటి బెంచ్ జిల్లా 5వ అదనపు న్యాయమూర్తి కృష్ణన్ కుట్టి, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి మహమ్మద్ ఇస్రాత్ ఫాతిమా, అడిషనల్ జూనియర్ జడ్జి డాక్టర్ శారద వివిధ రకాల కేసులను పరిష్కరించారు.

73 కేసులకు పరిష్కారం

నందలూరు(రాజంపేట): జాతీయ లోక్ అదాలత్ నందు 73 కేసులకు శాశ్వత పరిషారం లభించినట్లు నందలూరు జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెక్ కమిటీ చైర్మన్ కె.లత పేర్కొన్నారు. జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు జాతీయ లోక్ అదాలత్‌ను జడ్జి శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సివిల్ కేసుల్లో రూ. 6 లక్షలు, క్రిమినల్ కేసుల్లో రూ. 35,69,600లు ఫిర్యాదు దారులకు అందజేయడం జరిగిందని తెలిపారు. రాజంపేట జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు సంబంధించి మొత్తం 72 కేసులు పరిష్కరించిటన్లు తెలిపారు. ఇందులో సివిల్ రూ.17,38000లు, క్రిమినల్ రూ. 2,86,500లు ఫిర్యాదుదారులకు అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నందలూరు, రాజంపేట ఏపీపీలు ఉమారాణి, రెహనా రసూల్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు దాసరి నరసింహులు, న్యాయవాదులు మహమ్మద్ అలీ, ఆనంద్ కుమార్, ఏజీపీ షమీఉల్లా ఖాన్, కోర్టు కానిస్టేబుళ్లు, కోర్టు సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

రాచపల్లెలో ఇంటింటి ప్రచారం



రాచపల్లెలో ఎన్నికల ప్రచారంను నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

రామాపురం: మండలంలోని కొమ్మూరువాండ్లపల్లె, ఎగువ కొవ్వూరువాండ్లపల్లె, దిగువ కొవ్వూరువాండ్లపల్లె, కొలిమివాండ్లపల్లి, నడింపల్లి, చిన్నకొండావాండ్లపల్లె, మంగళపల్లిలో సర్పంచ్ వెంకటరెడ్డి, కొలిమివాండ్లపల్లె, సరస్వతిపల్లి సింగల్ విండో అధ్యక్షులు ఆదినారాయణరెడ్డి, పెద్దిరెడ్డి, రాచపల్లె ఎంపీటీసీ ద్వారకనాథరెడ్డి, తదితరులు శనివారం ఇంటింటా తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికని మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిలను భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి ఓటరు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు నాగసుబ్బారెడ్డి, కొవ్వూరు చలమారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, వెంకటామిరెడ్డి, సాయికుమార్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సన్నికుమార్ రెడ్డి, వెంకటశివారెడ్డి, వీరారెడ్డి, లోకేష్‌రాజు, హరి, నాగార్జున, సర్వేశ్వర్‌రెడ్డి, కార్యకర్తలు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

హ్యూమన్ రైట్స్ సెల్‌కు వెంకటరమణ ఎంపిక

సంబేపల్లె: జాతీయ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ రాయలసీమ జోన్ ఎస్సీ, ఎస్టీ సెల్ ఇన్‌చార్జిగా అన్నమయ్య జిల్లా బేపల్లె మండలం గుదియవాండ్లపల్లికి చెందిన వెంకట రమణను శనివారం నియమించారు. వెంకటరమణ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల హక్కుల సాధన కోసం నిత్యం పోరాటం చేస్తానని తెలిపారు.

వేణుగోపాలస్వామికి పూజలు

పెనగలూరు (ఓబులవారిపల్లె): మండలంలోని పెనగలూరులో వెలసిన వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి ఆలయ పూజారి చంద్రశేఖర్ శర్మ, గ్రామ పురోహితులు చెంచు సుబ్బనరసయ్య పూజలు నిర్వహించారు.

షాదీఖానా అభివృద్ధికి నిధులు

రాజంపేట: పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటలో ఉర్దూ ఘర్ షాదీఖానా అభివృద్ధికి శనివారం రూ.5 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా షాదీఖానా అభివృద్ధి కమిటీ చైర్మన్ మసూద్‌అలీ ఖాన్, జిల్లా మైనార్టీ ప్రధాన కార్యదర్శి జావిద్ అలీ మాట్లాడుతూ షాదీఖానా అభివృద్ధికి ఎంపీ మిథున్‌రెడ్డి నిధులు మంజూరు చేయించడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, మున్సిపాలిటి చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి సహకారం మరువలేనదన్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

పెనగలూరు (ఓబులవారిపల్లె): పెనగలూరు మండలంలో శనివారం ఉదయం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్తు శాఖ ఏఈ షఫీ తెలిపారు. విద్యుత్ లైన్ల వెంబడి ముళ్ల పొదలను తొలగించే క్రమంలో మండలంలోని పెనగలూరు, కొండూరు, బెస్తపల్లి సబ్ స్టేషన్ల పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

నియమావళిని పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

నందలూరు(రాజంపేట): ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలని తహసీల్దారు మహబూబ్ బాష, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సతీష్ కుమార్, ఎస్ఐ అబ్దుల్ జహీర్ సూచించారు. ఎంపీడీఓ సభా భవనంలో నిర్వహించిన సమావేశంలో శనివారం వారు మాట్లాడుతూ ఏ గ్రామంలో వ్యక్తులను ప్రేరేపించే విధంగా ఉన్న రాజకీయ పార్టీల పోస్టర్లను తొలగించాలని, నేతల యొక్క విగ్రహాలకు ముసుగులు తొడగాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఆర్ఐ సుశీల్ కుమార్ పాల్గొన్నారు.

జిల్లా ఎస్సీ కమిటీకి ఎంపిక

రాజంపేట: వైఎస్‌ఆర్‌సీపీ జిల్లా ఎస్సీ విభాగం కమిటీలో రాజంపేట నియోజకవర్గానికి చెందిన దళిత నేతలకు అవకాశం కల్పిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు విడుదల చేసింది. ప్రధాన కార్యదర్శిగా బొజ్జా పెంచలయ్య, కార్యదర్శులుగా భత్తల భిక్షుడు, జె.విజయశర్మ, సంయుక్త కార్యదర్శిగా రామాంజులు నియమితులయ్యారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎస్పీ కృష్ణారావు

రాయచోటి టౌన్: ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం తన ప్రాణాలను పణంగా పెట్టిన మహనీయుడు పొట్టిశ్రీరాములు అని జిల్లా ఎస్పీ కృష్ణారావు అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఎస్పీ కార్యాలయంలో శనివారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అవతరణ కోసం కృషి చేయడంతోపాటు ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న పొట్టి శ్రీరాములు ధీరోదాత్తుడని అన్నారు.

ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ డాక్టర్ రాజ్‌కమల్, డీపీఓ ఏఏఓ కృష్ణుడు, సీఐలు భాస్కర్, చంద్రశేఖర్, ఉమామహేశ్వరావు, ఎంటీఓ యం పెద్దయ్య, ఆర్ఐ వెంకటాచలపతి, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో మహిళలకు చేయూత



చెక్కును మహిళలకు అందజేస్తున్న దృశ్యం

నందలూరు(రాజంపేట): జగనన్న ఐదేళ్ల పాలనలో మహిళలకు ఆర్థిక చేయూతనిచ్చారని జెడ్పీటీసీ గడికోట ఉషారాణి, మండల పార్టీ అధ్యక్షుడు అన్నం నాగేంద్ర అన్నారు. ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఏపీఎం వసుంధర ఆధ్వర్యంలో శనివారం ఉదయం జగనన్న చేయూత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం 45-60 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన 1619 మంది మహిళల ఖాతాలకు నాలుగో విడతగా రూ.3.04కోట్ల నగదును నేరుగా జమ చేశారన్నారు. మళ్లీ అందరికీ సంక్షేమ పథకాలు అందాలంటే ఎంపీ అభ్యర్థిగా పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆకేపాటి అమరనాథరెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. అనంతరం జగనన్న చేయూత పథకం కింద చెక్కును మహిళలకు అందజేశారు. ఈ నేపథ్యంలో కేక్ కోసి మహిళలు సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గడికోట సుబ్బారెడ్డి, తుమ్మల భావన, అనుదీప్, సయ్యద్ అమీర్, కలీం, ఇబ్బు, అరిగెల సౌమిత్రి, ఆనాల మధు యాదవ్, గుణ యాదవ్, బయన బోయన భాస్కర్, వేణు మాధవ్, మహిళలు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



ముఖ్యమంత్రి జగనన్న చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఉపాధ్యాయులు

లక్కిరెడ్డిపల్లి: రాష్ట్రంలోని ఆదర్శ పాఠశాలలను ప్రభుత్వంలో విలీనం చేయడం అభినందనీయమని మోడల్ స్కూల్ ప్రోగ్రెసివ్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని లక్కిరెడ్డిపల్లె ఆదర్శ పాఠశాలలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి ఆదర్శ పాఠశాల అధ్యాపకులు, సిబ్బంది శనివారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి మాట్లాడుతూ దాదాపు పదేళ్ల నుంచి తాము కోరామని ఇపుడు జగనన్న ప్రభుత్వం ఏపీ మోడల్ స్కూళ్లను విద్యాశాఖలో విలీనం చేసి టీచర్లకు 010 పద్దు క్రింద జీతాలు చెల్లించేందుకు జీవో జారీ చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నిత్యపూజయ్య, సుధాకర్, నాగయ్య, ప్రసాద్, శ్రీనివాసులు, శ్రీకల సుమియా, భారతి, విజయ కుమారి, అరుణ కుమారి, రాజేశ్వరి సిబ్బంది పాల్గొన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు



సిద్దవటంలోని పరీక్ష కేంద్రంలో గదులను పరిశీలిస్తున్న అధికారులు

సిద్దవటం: ఈ నెల 18వ తేదీ నుంచి జరిగే పది పరీక్షలకు ఏర్పాట్లు చేశామని ఎంఈఓ శంకరయ్య తెలిపారు. సిద్దవటంజెడ్పీ పాఠశాలలో రెండు పరీక్ష కేంద్రాలను ఎంఈవో, ఇతర అధికారులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ శంకరయ్య మాట్లాడుతూ సిద్దవటం జెడ్పీ హైస్కూల్‌లో పడమర వైపు-ఎ సెంటర్, తూర్పు వైపు-బి సెంటర్లను ఏర్పాటు చేశారన్నారు. విద్యార్థులకు అన్ని మౌలిక వసతులను ఏర్పాటు చేశామన్నారు. భాకరాపేట, 11వ బెటాలియన్, సిద్దవటం, టక్కోలి, పి.కొత్తపల్ల, గ్రామాల్లోని జెడ్పీ పాఠశాలలు, సిద్దవటంలోని భారతి, సాయి, శ్రీ నలంద ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు కలిపి 255 మంది పరీక్ష రాస్తున్నారన్నారు. ఉదయం 8 గంటలకంతా విద్యార్థులు కేంద్రాలకు చేరుకోవాలన్నారు. కేంద్రం వద్ద 144 సెక్షన్ అములులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు మల్లికార్జునరావు, బి.సుబ్బారెడ్డి, ఖాజాహుస్సేన్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె: పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ రామయ్య విలేకరులకు తెలిపారు. మండలంలో ముక్కవారిపల్లె గురుకుల పాఠశాల ఎ, బీ సెంటర్లు,ఓబులవారిపల్లె, తల్లెంవారిపల్లి జెడ్పీ పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

సీసీరోడ్డు పనులకు భూమి పూజ



భూమి పూజ చేస్తున్న నీటి సంఘం అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ రత్నమ్మ

రైల్వేకోడూరు అర్బన్: రైల్వేకోడూరు మండలంలోని తంబిళ్ళవారిపల్లెలో రూ. 25లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు నీటి సంఘం అధ్యక్షుడుపంజం వేణుగోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ రత్నమ్మ శనివారం భూమి పూజ చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు సహకారంతో పంచాయతీలో అభివృద్ధి పనులు వేగంగా జరిగాయన్నారు. ఎంపీ విజయసాయిరెడ్డి నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుబ్రహ్మణ్యం, పంజం విజయరంగారెడ్డి, ఆకేపాటి రంగారెడ్డి, రామచంద్రారెడ్డి, నారాయణరెడ్డి, సాగర్‌రెడ్డి, కరుణాకర్ రెడ్డి, రాజారెడ్డి, నరసింహారెడ్డి, బాబు, పాలెంకోట చంద్ర తదితరులు పాల్గొన్నారు.

గండి అంజన్న సన్నిధిలో ప్రముఖులు



ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

చక్రాయపేట: గండి వీరాంజనేయస్వామిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. రాజంపేట ఎంపీ మిథ్‌న్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డిలు దర్శించుకున్నారు. ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి, చైర్మన్ కావలి కృష్ణతేజ ఆధ్వర్యంలో పత్యేక పూజలు చేయించారు. వారివెంట అన్నమయ్య జిల్లా జడ్పీటీసీల సంఘం అధ్యక్షుడు మద్దిరేవుల సుదర్శనరెడ్డి పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు

రాయచోటి టౌన్: ఆధ్మాత్మిక సౌరభాలు వెల్లివిరిసే రంజాన్ మాసమని అన్నమయ్య రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. రాయచోటి 5, 6వ వార్డులలోని బడీ కరిమియా మసీదు సమీపంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. అక్కడ ముస్లింలతో కలిసి విందు చేశారు. ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసం అంతా దైవ చింతనతో నియమ నిబంధనలతో గడపడంతో పాటు క్రమశిక్షణ,సేవాభావం వంటి వాటిని పాటిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఫయాజ్ బాష,బేపారీ మహమ్మద్‌ఖాన్, రిజ్వాన్, జబీవుల్లా, జాకీర్ హుస్సేన్, రౌనక్ హుస్సేన్, ఆసీఫ్ ఆలీఖాన్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రితోనే అభివృద్ధి సాధ్యం



సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న మాజీ జడ్పీటీసీ ఉపేంద్ర నాథ్ రెడ్డి

సంబేపల్లె: రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలోకి తీసుకెళ్లిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదేనని, ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని మాజీ జడ్పీటీసీ ఉపేంద్రనాథ్ రెడ్డి అన్నారు. మండలంలోని శెట్టిపల్లె, పెద్దబిడికి పంచాయతీలలో స్థానిక నాయకులతో కలిసి శనివారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డికి మద్దతుగా నిలిచి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చిన ఘనత జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్ రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, సర్పంచ్ వెంకటరమణ నాయక్, నరసింహారెడ్డి, తిరుపాల్ నాయక్, శంకరయ్య, జయనారాయణ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలపై దృష్టి సారించండి



ఎంపీ,ఎమ్మెల్యేలకు సమస్య విన్నవిస్తున్న నాయకులు

గాలివీడు: మండలంలోని 17 గ్రామాలలో తాగునీటి సమస్యలను పరిష్కరించాలని గాలివీడు మండల మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఉమాపతిరెడ్డి, దీప్తి , వెంకటాద్రి కోరారు. ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిలను శనివారం కలిసి సమస్యలపై విజ్ఞప్తి చేశారు. ఆయా గ్రామాలలో నీటి సమస్య ఉంటే తాత్కాలికంగా ట్యాంకర్ల ద్వారాఅందించి ఆదుకోవాలని కోరారు. ఎంపీ, ఎమ్మెల్యేలు స్పందిస్తూ తక్షణమే నీటిని అందించాలని అధికారులకు సూచించారు.

విజయం సాధించి ప్రజల రుణం తీర్చుకుంటా

ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు



ప్రభుత్వవిప్ కొరముట్లను సన్మానిస్తున్న నియోజకవర్గ నాయకులు

రైల్వేకోడూరు: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి తనపై నమ్మకంతో శాసన సభ్యుడిగా పోటీ చేసే అవకాశం కల్పించారని, మరోసారి విజయం సాధించి కోడూరు నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటానని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. ఆయనకు కోడూరు టికెట్ కేటాయించడంతో స్థానిక వైఎస్‌ఆర్‌సీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు శనివారం బాణసంచా కాల్చారు. ఎమ్మెల్యే కొరముట్లకు శాలువా కప్పి సన్మానించారు. స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో 101 టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను ఆదరిస్తున్న కోడూరు ప్రజలు, నాయకులకు, పార్టీ కార్యకర్తలకు, ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానన్నారు. కరోనా సమయంలోనూ పెద్ద ఎత్తున నిధులు తెచ్చి అభివృద్ధి పనులుచేశానని, ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందించామని పేర్కొన్నారు. అందరూ వైఎస్ జగనన్నను మరొక్కసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఏఏబి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, ముప్పాల హేమనవర్మ, చెవ్వు శ్రీనివాసులరెడ్డి, సాయికిశోర్‌రెడ్డి, మండల నాగేంద్ర, సుధాకర్‌రాజు, తోట శివసాయి, సిహెచ్.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబీకులకు పరామర్శ

ఓబులవారిపల్లె: మండల కేంద్రంలో మైనార్టీ ముస్లిం మహిళ షేక్ ఖైరున్‌బీ (80) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం పున్నాటివారిపల్లిలో మృతి చెందిన పున్నాటి శంకర్ రెడ్డి (50) కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు.

ఈ కార్యక్రమంలో సాయికిషోర్ రెడ్డి, పంజం సుకుమార్ రెడ్డి, ఎన్‌పీ జయపాల్ రెడ్డి, చెవ్వు శ్రీనివాసులు రెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి, ఎన్‌పి.శివారెడ్డి, పున్నాటి కృష్ణారెడ్డి, పున్నాటి ఈశ్వర్ రెడ్డి, తదితరులు నివాళులర్పించారు.

గెలిచి వస్తా

రైల్వేకోడూరు నియోజకవర్గానికి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనపై నమ్మకంతో అవకాశం ఇచ్చినందుకు గెలిచి వస్తానని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు శనివారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తెలిపారు. పులివెందులలో ఆయనను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనపై నమ్మకంతో పార్టీ అభ్యర్థిగా అవకాశం కల్పించినందుకు రుణపడి ఉంటానన్నారు.